## క్లుప్తంగా

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


కోలాటమాడుతున్న చిన్నారులు

కొత్తూరు: విద్యార్థులు ఉత్తమ లక్షణాలు అలవాటు చేసుకోవాలని రిటైర్డ్ హెచ్ఎం ఎద్దు గోలపాలదాసునాయుడు, హెచ్ఎం ఎ.గోవిందరావు అన్నారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. నైతిక విలువలు పాటించినప్పుడే విద్యార్థులు సమాజంలో ప్రయోజకులుగా తయారవుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు, జానపద, దేశభక్తి, సినీ గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎస్ఎంసీ చైర్‌పర్సన్ కళావతి, పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జనరల్ సెక్రటరీగా అరుణ్‌కుమార్



ఆమదాలవలస: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సౌత్ ఇండియా అడిషనల్ జనరల్ సెక్రటరీగా పట్టణానికి చెందిన గరికి అరుణ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చెన్నుపాటి శ్రీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు అరుణ్‌కుమార్ తెలిపారు. జాతీయ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం సరికాదు


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

సారవకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ తరఫున పోటీ చేస్తున్న విజయగౌరీకి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదివరకు ఎన్నడూ లేని విధంగా ఈసారి రాజకీయ పార్టీలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతిస్తున్నాయని, దీని వలన ఉపాధ్యాయుల సమస్యలపై చట్టసభలలో పోరాటం చేసే అవకాశం ఉండదన్నారు. ఉపాధ్యాయులు విద్యావంతులు కనుక రాజకీయాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్, మండల శాఖ అధ్యక్షుడు శ్రీను, ప్రధాన కార్యదర్శి గణేష్, కోశాధికారి భరణికుమార్ ఉన్నారు.

### భూసార పరీక్షలతో ప్రయోజనం


భూసార కార్డులతో రైతులు

సరుబుజ్జిలి: రైతులు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవడం వలన అనేక ప్రయోజనాలు ఉంటాయని అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.సత్యవతి తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం రైతు సేవా కేంద్రంలో భూసార పరీక్షలు-పంటల్లో ఎరువుల వాడకం అన్న అంశంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. మట్టి పరీక్షలు ఫలితాల ఆధారంగా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటల్లో ఎరువులు తగు మోతాదులో వినియోగించాలని సూచించారు. అధికంగా ఎరువుల వాడకం వలన అనర్థాలు ఉంటాయన్నారు. రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవాలన్నారు. దీనివలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని రకాల రాయితీలు, సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. ఏఓ బొడ్డేపల్లి పద్మనాభం, వ్యవసాయ విస్తరణాధికారులు తమ్మినేని రాము, అశోక్, వీఏఏ యుమున పాల్గొన్నారు.

### సమగ్రాభివృద్ధిని పెంపొందించాలి


మాట్లాడుతున్న డీఈఓ తిరుమల చైతన్య

ఆమదాలవలస: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో సమగ్ర అభివృద్ధిని పెంపొందించాలని డీఈఓ తిరుమల చైతన్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీఓ అనురాధ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యా సామర్థ్యాలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ తయారు చేయడం, తల్లిదండ్రుల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానజ్యోతితో.. భవితకు పునాది


శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో మారనున్న చదువులు
- కార్యకర్తలకు అభ్యాసనలో మెరుగులు
- ముగిసిన మొదటి విడత శిక్షణ


టీఎల్ఎంను ప్రదర్శిస్తున్న కార్యకర్తలు

నరసన్నపేట: చిన్నారుల కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేవారికి అభ్యాసనలో మరింత మెరుగులు దిద్ది పోటీ ప్రపంచంలో నిలబడేలా తీర్చిదిద్దేందుకు దృష్టి పెట్టింది. జాతీయ విద్యా విధానంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మున్ముందు మారబోతున్నాయి. 3 నుంచి 6 ఏళ్ల మధ్య వయసున్న చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందిచేలా కేంద్రం చర్యలు తీసుకుంటుంది. దీంట్లో భాగంగా 'జ్ఞానజ్యోతి' పేరిట ప్రత్యేక కార్యక్రమాలను తీసుకువచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖ అధికారులు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేశారు.

**ప్రత్యేక శిక్షణ..**

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 18 నుంచి జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా నైపుణ్య శిక్షణ ఇచ్చారు. మొదటి విడత శిక్షణ మంగళవారంతో ముగిసింది. రెండే విడత శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లల ప్రాథమిక అభ్యాసనాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక శిక్షణ తరగతులకు సాల్ట్ ప్రోగ్రాం సంకేతిక సహకారం అందిస్తోంది. ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతులను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా అంగన్‌వాడీలకు మెలకులవలు నేర్పిస్తున్నారు. అన్ని మండల కేంద్రాల్లో ఈ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారు.

### వైఎస్సార్‌సీపీ హయాంలోనే పటిష్ట పునాదులు..

చిన్నారుల శ్రేయస్సు కోసం నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలు వారి భవితకు దిక్సూచిగా నిలవాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బలమైన పునాదులు వేసింది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీల్లో సైతం మౌలిక వసతులు పెంపొందించడానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. ప్రతి కేంద్రానికీ ఆట వస్తువులను పంపిణీ చేసింది. పిల్లల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టి పౌష్టికాహారం సక్రమంగా అందేలా మెనూను రూపకల్పన చేసి అమలు చేయించింది.

### ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం



జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తున్నాం. ఇది మూడేళ్లపాటు విడతల వారీగా కొనసాగుతోంది. ఈ సంవత్సరం 40 రోజులపాటు శిక్షణ ఉంటుంది. దీంట్లో ఆరు రోజుల శిక్షణ ముగిసింది. మిగిలిన శిక్షణ ఆన్‌లైన్‌లో ఉంటుంది. ఇందులో మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– పేడాడ దాలినాయుడు, ఎంఈఓ-2, నరసన్నపేట

### సులభంగా విద్యా బోధన



ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ, ప్రాథమిక విద్యా బోధన జరుగుతోంది. కార్యకర్తలకు ప్రాథమిక విద్య, 1, 2 తరగతుల చిన్నారులకు సులభతరంగా బోధించేందుకు జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది. కార్యకర్తలు కూడా ఈ శిక్షణను సక్రమంగా వినియోగించుకుని కేంద్రాల్లోని చిన్నారులకు బోధించాలి.

– నాగమణి, ఐసీడీఎస్ పీఓ, నరసన్నపేట

### శిక్షణ ఉపయోగకరంగా ఉంది



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గుణాత్మకమైన బోధన అందించేందుకు వీలుగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం చాలా బాగుంది. డీఆర్పీలు అన్ని విషయాలు అర్థమయ్యేలా వివరించారు. దీని ద్వారా ఎంతో నేర్చుకున్నాను. దీనిని కేంద్రంలో పక్కాగా అమలు చేసి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చుతాను.

– డి.తేజ, బాడాం, అంగన్‌వాడీ కార్యకర్త

## ఎన్నికల హామీలు ప్రకటనలకే పరిమితం

- అలవికాని హామీలు ఇచ్చి చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పశ్నిస్తుందనే అక్కసుతో ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని, రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో మద్యం రేట్లు పెంచేసి.. గవర్నర్‌తో పెంచబోమని చెప్పించారన్నారు. ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని అదనంగా మోపారన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి హామీలపై గవర్నర్‌కు స్పష్టత లేదన్నారు. టీడీపీ ఇస్తామన్న పథకాలన్నీ మోసాలుగా మిగిలాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో హామీలు ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. మహిళా సంక్షేమం ద్వారానే సామాజిక స్వాతంత్ర్యం సాధ్యమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నమ్మారన్నారు. ఆ దిశగానే వివిధ సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను అమలు చేశారన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అనేక అవకాశాలు కల్పించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రైతులకు పంట పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకానికి అతీగతి లేకుండా పోయిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1,500 నగదు, తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు చదివితే అందరికీ రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలన్నారు. ఇసుక, మద్యం వ్యాపారాలతోపాటు అనేక అక్రమాలకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కూటమి నాయకులు, వారి అనుచరులు పాల్పడుతున్నారని ఆరోపించారు.

### ఘనంగా మెహర్‌బాబా జయంతి


పూజలు నిర్వహిస్తున్న కృష్ణచైతన్య, తదితరులు

నరసన్నపేట: స్థానిక ఆదివరపుపేటలోని బాబా మందిరంలో అవతార్ మెహర్ బాబా జయంతి మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి మెహర్ బాబా భక్తులు పలు కార్యక్రమాలు చేపట్టారు. భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమాల్లో పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య పాల్గొన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, చింతు రామారావు, పాగోటి రాజారావు, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవ రాజు, కనపల శేఖరరావు తదితరులు ఉన్నారు.

### రూ.50 వేల విరాళం

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీకి కొత్తూరు గ్రామానికి చెందిన గుడ్ల శ్రీధర్ (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) తన తండ్రి ఆనందరావు జ్ఞాపకార్థం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ బండారి రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ మొత్తాన్ని కాలేజీలోని అన్ని గ్రూపుల్లో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించిన ఒక్కో విద్యార్థికి నగదు ప్రోత్సాహం అందివ్వడం జరుగుతుందన్నారు. కాలేజీకి ప్రతీ ఏడాది రూ.50 వేల చొప్పున శ్రీధర్ అందిస్తున్నారన్నారు.

## భక్తులకు ఇబ్బంది కలగకూడదు

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్


అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

జలుమూరు: శ్రీముఖలింగంలో బుధవారం నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. మంగళవారం శ్రీముఖలింగంలో పర్యటించారు. ప్రత్యేకాధికారి ఎం.లావణ్యతో కలిసి ఆలయ పరిసరాలు, క్యూలు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి సేవలు మరింత మెరుగుపరచడానికి సీసీ కెమెరాలు పెట్టాలన్నారు. భక్తులకు ఎండ తగలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ జెన్ని రామారావు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఈఓ పి.ప్రభాకరరావు, సర్పంచ్ టి.సతీష్ కుమార్ ఉన్నారు.

## సంక్షిప్తంగా..

### ఎగబడిన జనం


చికెన్, ఉడికించిన గుడ్లు కోసం తరలివచ్చిన జనం

నరసన్నపేట: బర్డ్ ఫ్లూ భయంతో చికెన్, గుడ్లు అమ్మకాలు పూర్తిగా తగ్గాయి. వ్యాపారులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. చికెన్ అమ్మకాలు పెంచేందుకు వీలుగా చికెన్ వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో నరసన్నపేటలోని వైఎస్సార్ కూడలి వద్ద మంగళవారం ఫ్రై చేసిన చికెన్ 100 కేజీలు, ఉడికించిన గుడ్లు 500 ఉచితంగా పంపిణీ చేపట్టారు. వందలాది మంది ఎగబడ్డారు.

### లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

పాతపట్నం: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ప్రిన్సిపాల్ శంకర్ నారాయణ అన్నారు. స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న విక్టరీ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్లు అప్పారావు, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

### శత శాతం ఉత్తీర్ణత సాధించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓలు కె.రాంబాబు, బి.గల్లవాడు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సినీ గీతాలకు విద్యార్థులు డాన్సులు చేశారు. హెచ్ఎం టి.కేశవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అర్థమయ్యేలా బోధించండి

హిరమండలం: అంగన్‌వాడీ చిన్నారులకు ఆట, పాటలతో అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని తహసీల్దార్ ఎస్.హనుమంతురావు, ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంఈఓలు కె.రాంబాబు, బి.గల్లవాడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

### బాల్యం నుంచే సమగ్రాభివృద్ధి

పాతపట్నం: పిల్లల సమగ్రాభివృద్ధి బాల్యం నుంచే జరగాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్య అందించాలని ఎంపీడీఓ టి.చంద్రకుమారి అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. సీడీపీఓ విమలరాణి, ఎంఈఓ-2 తిరుమలరావు, ప్రిన్సిపాల్ రత్నకుమారి పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రం పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను సీఐ వి.రామారావు, తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగునీరు, ర్యాంప్, తదితర సదుపాయాలు ఎలా ఉన్నాయో తనిఖీ చేశారు. పాతపట్నంలో 270 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎంపీడీఓ టి.చంద్ర కుమారి, ఎస్ఐ బి.లావణ్య, ప్రిన్సిపాల్ ప్రసాద్ ఉన్నారు.

### భూసార పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

హిరమండలం: ఉచిత భూసార పరీక్షలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమదాలవలస (ఎస్‌టీఎల్) భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ బి.సత్యవతి అన్నారు. మంగళవారం గులుమూరు రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఒకసారి భూసార పరీక్ష చేయించుకుని రిపోర్టు పొందితే మూడేళ్ల వరకు వినియోగించుకోవచ్చునన్నారు. ఏఓ బి.సంధ్య పాల్గొన్నారు.

### క్రమశిక్షణ అలర్చుకోవాలి

బూర్జ: విద్యతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివ్వాల తవిటినాయుడు అన్నారు. మంగళవారం బూర్జ జీజేసీలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఆటల పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఈ-పంట నమోదు పూర్తిచేయాలి

బూర్జ: మార్చి 3వ తేదీలోగా రబీ పంట కాలానికి సంబంధించి ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఏఓ ఎస్. శ్రీనివాసరావు మంగళవారం తెలియజేశారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో సిబ్బంది నిమగ్నమై ఉండడంతో ఈ-పంట నమోదులో జాప్యం జరిగిందని, అందుకే ప్రభుత్వం గడువు పొడిగించిందన్నారు. మార్చి 5 నుంచి 10వ తేదీ వరకు ముసాయిదా కాపీ సామాజిక తనిఖీ కోసం ఉంచడం జరుగుతుందన్నారు. మార్చి 12న తుది జాబితా ప్రదర్శిస్తామన్నారు.

### పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం

కొత్తూరు: మహిళలు పొదుపు చేయడం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధించగలరని స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని లబ్బ గ్రామంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

### శ్రీరామదీక్ష స్వీకరణ



రామనామం అనునిత్యం పఠించడం వలన ముక్తి కలుగుతుందని సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస శ్రీరామానంద ఆశ్రమం వ్యవస్థాపకుడు తొత్తడి వెంకటరమణస్వామి అన్నారు. ఆశ్రమం ఆవరణలో మంగళవారం పలు గ్రామాలకు చెందిన భక్తులు శ్రీరామదీక్ష స్వీకరించారు. దీక్షల వలన మానసిక ఒత్తిడి, శారీరక అలసట దూరం అవుతాయన్నారు. ఈ దీక్షలు శ్రీరామనవమి రోజున భద్రచలంలో విరమణ చేయనున్నట్లు వెల్లడించారు.

– సరుబుజ్జిలి

### అవస్థలు



ఆమదాలవలస మున్సిపాలిటీలోని 15వ వార్డు పూజారిపేటలో గల నుయ్యి వీధిలో మురుగునీటి కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య దశాబ్దాలుగా ఉన్నా.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు కూడా ఇచ్చామని ఆ వార్డు ప్రజలు చెబుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కూడా వినతిపత్రం అందించామని, అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస

### నిలువ నీడలేక..



ఈ చిత్రం కొత్తూరు మండలంలోని నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్ గోడ నీడలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు. నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ప్రైవేట్ వ్యక్తికి ఆర్టీసీ యాజమాన్యం లీజుకు ఇచ్చింది. లీజుదారుడు కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకొని చుట్టూ గోడలు నిర్మించి గోదాంగా తయారు చేశాడు. బస్సుల కోసం వేచి ఉండటానికి నిలువ నీడలేకపోవడంతో ఎండలోనే గంటల తరబడి నిరీక్షంచాల్సిన దుస్థితి నెలకొంది.

– కొత్తూరు

### సత్కారం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న కూరగాయలు, పండ్లు వినియోగదారులకు అందించేందుకు ప్రత్యేక మార్ట్ నిర్వహిస్తున్న నరసన్నపేటకు చెందిన రావాడ మోహన్ రావును జిల్లా వ్యవసాయశాఖ సోమవారం రాత్రి ఘనంగా సత్కరించింది. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

– నరసన్నపేట

## ఇష్టారాజ్యంగా..!

- అనుమతుల్లేకుండా మూడు అంతస్తుల భవన నిర్మాణాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు, సిబ్బంది
- ప్రభుత్వ ఆదాయానికి గండి


భవానీపురం వద్ద అనుమతి లేకుండా నిర్మాణం చేస్తున్న మూడు అంతస్తుల భవనం

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో ఎక్కడకక్కడ ప్రభుత్వ, పంచాయతీ స్థలాలు ఆక్రమణ, మరోవైపు అనుమతి లేకుండా భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు గమనించి నిరోధించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి లేకుండా మూడేసి అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు, సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ.. పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవానీపురం వద్ద మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. దీనికి ఎటువంటి అనుమతులు లేకపోయినా పంచాయతీ సిబ్బంది దీనిపై చర్యలు తీసుకోవడం లేదు. ఇలా ప్రతీ వీధిలోనూ అనుమతులు లేని నిర్మాణాలు కొనసాగుతున్నాయి. పంచాయతీ అనుమతి తీసుకుంటే ప్లాన్ అప్రూవల్ చేయించుకోవాలి. అప్పుడు నిబంధనల మేరకు పంచాయతీకి వేలల్లో ఆదాయం వస్తుంది. పంచాయతీకి రావాల్సిన ఆదాయం పక్కన పెట్టి వారి ఆదాయాన్ని సిబ్బంది చూసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు జరుగుతున్నాయి. పైడితల్లి ఆలయ కూడలి వద్ద రాత్రికి రాత్రి దుకాణాన్ని (బడ్డీ) ఆక్రమణదారుడు పెట్టారు. దీనిని గమనించినా.. పంచాయతీ సిబ్బంది పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వీటిన్నింటిపై విమర్శలు వస్తున్నాయి. అనుమతి లేని నిర్మాణాలపై ఈఓ ద్రాక్షాయిని వద్ద ప్రస్తావించగా.. అనుమతి లేని భవనాలను గుర్తిస్తున్నామని, ప్లాన్ అప్రూవల్ పెట్టుకోవాలని సూచనలు చేస్తున్నామన్నారు. అప్పటికీ వాళ్ల ప్లాన్ అప్రూవల్ చేయించుకోకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

### వ్యక్తిత్వ నైపుణ్యం అవసరం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నరసన్నపేట: చదువుతోపాటు వ్యక్తిత్వ నైపుణ్యం కూడా అవసరమని, అప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వ్యక్తిత్వ వికాస నిపుణుడు దుప్పల రవికుమార్ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ సాంకేతికంగా ప్రపంచం మారుతుందని, విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకోనున్నాయన్నారు. దీనికి తగ్గట్టుగా యువత నైపుణ్యతను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల డైరెక్టర్ సి.హెచ్.దుర్గాప్రసాద్, యాజమాన్య ప్రతినిధి పాగోటి రామచంద్రరావు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఉత్సవాలు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలో ఉన్న ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త బూర్లె శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 26వ తేదీ రాత్రి 7 గంటల నుంచి రుద్రాభిషేకం, 28న అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు.